క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. హెచ్ఎం వి.పూర్ణ చంద్రశేఖరరావు మాట్లాడుతూ విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని, ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలోని విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావెళ్ల శ్రీనివాసరావు, ఎస్.శ్రీదేవి, టీ.నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వేషధారణ పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ సంస్కృతి సంబరాలు గురించి వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డివి కమల్‌మోహన్, శేషురవికుమార్, సిద్ధయ్య, పోలిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం తుమ్మపూడి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ చెత్త సేకరణకు సహకరించాలని కోరారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా ఉంచి పంచాయతీ వాహనాలలో మాత్రమే వేయాలని, ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. సర్పంచి షేక్ అజీజాన్, పంచాయతీ కార్యదర్శి టి.భవాని, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు సిద్ధం



పెనుమాక క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రెండో విడత ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో నిర్వహించనున్నారు. మొదటి విడతలో గ్రామ, వార్డు సచివాలయాల్లో గెలుపొందిన వారికి పెనుమాక వందే మాతరం హైస్కూల్‌లో సంబంధిత ఆటల పోటీలకు సంబంధించి కిట్లను అందజేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షులు దామేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎం పూర్ణచంద్రశేఖరరావు, విద్యా కమిటీ చైర్మన్ సుభాని, పి.ఇ.టి.లు రమేష్, హరికృష్ణ, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, మహిళా పోలీస్ రేణుక పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో క్రికెట్ పోటీలు

తాడికొండ: తుళ్లూరు మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు ఈ నెల పదో తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శివన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, మేరీమాత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మహిళా క్రికెట్ పోటీలు, విట్ ఏపీ యూనివర్సిటీలో మెన్ అండ్ ఉమెన్ బ్యాడ్మింటన్, తుళ్లూరు ఓపెన్ గ్రౌండ్‌లో పురుషుల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పలు జట్ల క్రీడాకారులు ఆయా పోటీలలో పాల్గొనాలని సూచించారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

ఫిరంగిపురం: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విలియమ్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 26 నుంచి ఈనెల 9వ తేదీ వరకు గ్రామస్థాయి క్రీడాపోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పోటీల్లో ఎంపిక చేసిన జట్లతో బుధవారంనుంచి 11, 12, 18, 19 తేదీలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీలు మార్నింగ్‌స్టార్ కళాశాల గ్రౌండ్, సెయింట్ పాల్స్ పాఠశాల గ్రౌండ్‌లో ఎంపిక చేసినట్లు వివరించారు.

రోలర్ స్కేటింగ్ పోటీలలో వివా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని : వివా ది స్కూల్ బై, గ్రేడ్–3 విద్యార్థి మధుమాల అద్య, గ్రేడ్ 9 భీమవరపు లిఖితా రెడ్డి విశాఖపట్నంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివా, వీవీఐటీ కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ గుంటూరు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో 3 బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందనీ, మధుమాల అద్య వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయనీ, వివా సంస్థ విద్యతో పాటుగా 11 మంది వ్యాయామ ఉపాధ్యాయులతో అన్ని క్రీడలలో శిక్షణ అందిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన అద్య, లిఖితా రెడ్డిలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్టి కమాండర్ కె శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సంధానకర్త కె.మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జోతి మెటిల్డా, స్కేటింగ్ కోచ్ కె.కళ్యాణ్ అభినందించారు.

ఘనంగా జన్ భగీరథీ



మేడికొండూరు: మండల పరిధిలోని డోగిప్రరు సచివాలయం వద్ద సోమవారం ఘనంగా జన్ భగీరథీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తు ఉన్న కాంస్య విగ్రహం ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచి కొండెపోగు సాంబ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, వెల్ఫేర్ సెక్రటరీ కొప్పుల దివ్య, షర్మిల పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాడికొండ: పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కలలో నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నిడుముక్కల శ్మశానం వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నలుగురితో పాటు 2 సెల్‌ఫోన్‌లు, రూ.2,490 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

దివ్యాంగులకు బజరంగ్ ట్రైసైకిళ్లు పంపిణీ



గోవిందుకు ట్రైసైకిల్ అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: బజరంగ్ జన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా దివ్యాంగ దర్శని కింద కంటెపూడిలోని కొండమూరి గోవిందు, మామిళ్లపల్లిలోని మన్నెబోలు వీరభద్రుడుకు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ సోమవారం ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ క్రమంలో వారి వద్దే ట్రైసైకిళ్లను పంపిణీ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా కంటెపూడి, మామిళ్లపల్లి గ్రామాల్లో నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని శిబిరాల నిర్వహణతో బజరంగ్ సేవలందించడంపై గ్రామస్తులు అంబటి మురళీకృష్ణను అభినందించారు.

కేఎల్‌యూను సందర్శించిన కాలిఫోర్నియా బృందం



ప్రొఫెసర్ సోలొమెన్ దార్విన్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ వైస్ చాన్సలర్ పార్థసారథి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ వర్సిటీని అమెరికాలోని బర్కిలీకి చెందిన కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ బృందం సోమవారం సందర్శించింది. అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోలొమన్ డార్విన్, తన ప్రతినిధుల బృందంతో కలసి తమ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కాలిఫోర్నియా స్టేట్ వర్సిటీకి, కేఎల్ వర్సిటీల మధ్య కొనసాగుతున్న వివిధ విద్యా పరిశోధన కార్యకలాపాల గురించి చర్చించామని తెలిపారు. ఇన్నోవేషన్ ద్వారా ఏ విధంగా ఆర్థిక అభివృద్ధి చేయవచ్చనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహరాజుతో కలసి ఇన్నోవేషన్ రంగంలో రెండు యూనివర్సిటీల మధ్య సహకారం గురించి చర్చలు జరిపినట్లు వివరించారు. బర్కిలీ నుంచి వచ్చిన బృందాన్ని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ సత్కరించారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ హరికిరణ్ వేగే, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

నులకపేట ఉర్దూ పాఠశాల తనిఖీ



సైన్స్ నమూనా పరిశీలిస్తున్న ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం సోమవారం సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ సమష్టి కృషితో పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతోందని అన్నారు. విద్యాకమిటీ చైర్మన్ షబీర్ పాఠశాల అభివృద్ధికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. అనంతరం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షాహిద్ అలీ నేతృత్వంలో విద్యార్థులు రూపొందించిన క్లాసిఫికేషన్ ఆఫ్ కండక్టర్స్ అండ్ ఇన్సులేటర్ అనే సైన్స్ నమూనా ఎంతో బాగుందని ఉపాధ్యాయులు ఉపాధ్యాయుడు, విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చేతిరాతలో నైపుణ్యం పెంపొందించుటకు కాలిగ్రఫీ శిక్షణ ఇప్పించి, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షబీర్ పాల్గొన్నారు.

వృద్ధులకు, అనాథలకు దుప్పట్లు పంపిణీ



అనాథకు దుప్పటి అందజేస్తున్న మోతడక చలపతి ఇంజనీరింగ్ విద్యార్థులు

తాడికొండ: సమాజ సేవకు మోతడక చలపతి విద్యార్థులు తాము సైతం అంటూ ముందడుగు వేశారు. సీఎస్ఈ టెక్నోక్రాట్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు విద్యార్థులు అర్ధరాత్రి రోడ్ల వెంబడి నిద్రించే వృద్ధులకు, దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రి, మార్కెట్ సెంటర్, శంకర్ విలాస్, విద్యానగర్ పలు ప్రాంతాలలో సంచరించి రోడ్లపై నిద్రస్తున్న అనాథలను తట్టిలేపి సుమారు 70 మంది వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు అందజేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి జి.రామచంద్రరావు అభినందించారు.

విజ్ఞాన్ వర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు



ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధి కౌన్సిలర్ కెంటారో ఒరిటో తదితరులతో చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని న్యూఢిల్లీలో గల ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. జపాన్ ఎంబసీ ప్రతినిధులు కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీ రికుతో ఐటోలకు చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణంలు స్వాగతం పలికారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణం మాట్లాడుతూ గుంటూరు రీజియన్‌లోని విద్యార్థులు నేర్చుకోవడానికి వీలుగా జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని జపాన్ ప్రతినిధులను కోరారు. స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్, అకడమిక్, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను అభివృద్ధి చేసుకోవడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జాయింట్ మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీకి విచ్చేసిన కౌన్సిలర్ కెంటారో ఒరిటా మాట్లాడుతూ రాబోయే కాలంలో ఇండియా–జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను రూపొందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జపాన్ దేశంలో యువ ఇంజినీర్లకు లక్షల్లో ఉపాధి అవకాశాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ దేశంలో యువ ఇంజినీర్ల కొరత అధికంగా ఉందని, అందుకే తాము యువ ఇంజినీర్లతో పాటు అన్‌–స్కిల్డ్ లేబర్ కోసం యువత అధికంగా ఉన్న ఇండియా వైపే చూస్తున్నామన్నారు. గుంటూరు రీజియన్‌లోని ప్రజలకు ఉపయోగపడేలా జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించారు. జపాన్ ప్రతినిధులు విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మంచాలలో ధనుర్మాస పూజలు



మంచాల (చేబ్రోలు): మండల పరిధిలోని మంచాల గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామున తిరుప్పావై, దీపాలంకరణ పూజలు చేశారు. పరాశరం మారుతీ వరప్రసాద్ విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



పట్నంబజారు: దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులు కోర్టుకు హాజరుపరిచారు. పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో సోమవారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.వీరేంద్రబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్దార్థ గార్డెన్స్‌లో శుభకార్యం జరుగుతున్న వేళ ఒక బ్యాగులో 120 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీన పట్టాభిపురం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వీరేంద్రబాబు, ఎస్ఐ విజయకుమార్‌లు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఇన్నర్ రింగురోడ్డులోని వెల్‌కమ్ హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయటంతో పారిపోయేందుకు చూశాడు. వెంటబడి పట్టుకున్న పోలీసులు సదురు వ్యక్తిని గుంటూరు నగరం మల్లికార్జునరావుపేటకు చెందిన షేక్ సైదుబాబు అలియాస్ సైదా అలియాస్ బాబుగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా సిద్దార్థ గార్డెన్స్ కల్యాణమండపంలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు నుంచి 120 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందుతుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు విజయ్‌కుమార్, పి.ఏక్‌నాథ్, సిబ్బందిని డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లు అభినందించారు.

10న జరిగే గిరి ప్రదర్శనను జయప్రదం చేయాలి

నెహ్రూనగర్: హరిదాసుల (మాల దాసుల) ఆత్మగౌరవార్థం ఈనెల 10వ తేదీన కృష్ణ ధర్మ రక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.దుర్గారావు ఆధ్వర్యంలో జరగనున్న ఇంద్రకీలాద్రి మహాగిరి ప్రదక్షిణను రాష్ట్రంలోని మాలదాసులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం అడవబజార్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 500 మంది అలంకార భూషితులైన మాలదాసుల హరినామ స్మరణ, వందమంది కోలాట కళాకారులు నాట్య ప్రదర్శన చేసుకుంటూ ఈ నెల 10 తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మాల దాసులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘ నాయకులు చెవుల కోటి రామాంజనేయులు, పాండురంగ నాయక స్వామి, ఏడుకొండలు, రవీంద్రబాబు, ఈశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: గ్రామీణ యువతీ యువకులకు ఉపాధి లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహించటం జరిగిందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం లాంఫాం నందున్న కె.వి.కె.లో కె.కె.వి. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల శిక్షణ తరగతులు ముగిశాయని శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికెట్లను అందజేశామన్నారు. పుట్టగొడుగుల సాగు వ్యవస్థ, బటన్ పుట్ట గొడుగులు, మిల్కీ పుట్టగొడుగులు సాగు, స్పాన్ ప్రొడక్షన్ టెక్నాలజీ, కేసింగ్, పుట్టగొడుగుల వ్యాధులు, కోత వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గంగాదేవి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పెదనందిపాడు: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కనపర్తి కేజియా (19) పెదనందిపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాజుపాలెం సాంబయ్యకు మూడు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్ పరిచయం అయ్యారన్నారు. తర్వాత ప్రేమగా మారిందని ఇరువురి పెద్దల సమక్షంలో మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నారని వివరించారు. అయితే కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తుతున్నాయి. వీటికి తోడు అత్తమామలు, బంధువులు వేధింపులు ఎక్కువగా ఉండటంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కేజియా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అనుమానాస్పద స్థితిలో కనిపించిందన్నారు. మృతురాలి తల్లి కనపర్తి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.